# అంతరాత్మ

నేనూ, ప్రకాశరావూ పార్కులో కూచుని కళల్లో వాస్తవికతను గురించి చర్చించుకుంటున్నాం. ఆ చర్చ యెట్లా వచ్చిందీ నేనిప్పుడు సరిగా చెప్పలేను కాని, అభ్యుదయ రచనల్లో దుష్టపాత్రలను సృష్టించేటప్పుడు ఆ పాత్రలు తమ వర్గానికే దుర్మార్గంగా వుండేటట్టు చిత్రించటం వాస్తవికత కాదని నేనన్నాను. ఆ దుర్మార్గం వర్గ వైషమ్య జనితంగా వుంటేనే తప్ప అభ్యుదయ దృక్పథం వ్యక్తం కాదని నేనంటున్నాను. ప్రకాశరావు ఇంచుమించు నాతో ఏకీభవిస్తున్నాడు.

ఈ సమయంలో "క్షమించండి" అంటూ ఆ యువకుడు మాకు సమీపంలో వచ్చి కూర్చున్నాడు. నేనతని కేసి ఆశ్చర్యార్థకంగా చూశాను. చాలా చిన్నవాడు. పాతికేళ్లు కూడా వుండవేమో. పట్నంలో యెంతకాలం నుంచి వుంటున్నాడో తెలీదు గాని, తెలుగువాళ్ల ఆకార వైఖరులు మారలేదు. మట్టిరంగు మిల్లుబట్టలు కట్టుకున్నాడు. నిండు చేతుల షర్టు, సైకిలు కట్టుధోవతీ, పైన ఉత్తరీయం కూడా ఉంది. అప్పుడే ఏ బెజవాడ నుండో దిగినట్టుగా వున్నాడు.

"మీరిప్పుడన్నమాట విన్నాను" అన్నాడా యువకుడు. "మీరు చెప్పే మాటలో నాకు నమ్మకం కుదరలా!"

"ఏమైనా తప్పు చెప్పానా?" అన్నాను.

"మీకు అమ్మా, నాన్నా వున్నారా?" అని అడిగాడు.

ఎందుకిట్లా అడుగుతాడా అని ఆశ్చర్యపడుతూ, "లేరు" అన్నాను.

"పోనీ అన్నదమ్ములున్నారా?" అన్నాడు.

"దగ్గర్లో యెవరూ లేరు" అన్నాను.

"మీ బంధులెవరూ మీకు దగ్గర్లో లేరనుకుంటాను?"

"అవును"

"అందుకే మీకు సవర్గ దుర్మార్గం గురించి ఏమీతెలీదు" అన్నాడతను.

"సవర్గ దుర్మార్గం నేనూ చూశాను. అన్నదమ్ములమధ్య కలహాలూ, భార్యా భర్తల మధ్య కలహాలూ వుంటాయి. కాని వాటికి ప్రత్యేక కారణాలుంటాయి. ఒకే వర్గానికి

చెందిన కారణంగా వ్యక్తులమధ్య వైషమ్యం ఉండదు. ఆ కారణాలు వ్యక్తిపరంగా వుంటాయిగాని వర్గపరంగా వుండవు" అన్నాను.

"అయితే మధ్యతరగతిలో కొన్ని వర్గాలగురించి మీకేమీ తెలియదు" అన్నాడా యువకుడు.

"చెబితే తెలుసుకుంటాను" అన్నాను, కపటవినయం నటిస్తూ.

ఆ యువకుడు కొంచెం ఆలోచించి "నాకథ చెబుతాను, వినండి" అన్నాడు.

❀ ❀ ❀ ❀ ❀

నాపేరు సుదర్శనం (అన్నాడు యువకుడు). నేను మద్రాసులోనే పుట్టాను. పెరిగాను. నా అవతారం చూసి పొరపాటుపడకండి. రెండేళ్ళనుంచీ నేను ఆంధ్రలో వుంటున్నాను. మీ బోటి వారంతా ఆంధ్రను వదలి పట్నంవస్తే నేను పట్నం వదలి అటువేపు వెళ్ళాను. మానాన్న చాలా ఏళ్లు పట్నంలో ఉద్యోగంచేసి రిటైరై మూడేళ్ల క్రితం పోయినాడు. ఆయన పేరు చెబితే మీరు బహుశా గుర్తించవచ్చు. కాని చెప్పను. అది మీకు అనవసరం. మానాన్న పోయేవరకూ మేం బాగా బతికాం. నా కిద్దరన్నలున్నారు. ఒక అక్కా ఒక చెల్లెలు కూడా వున్నారు. మా అమ్మ బతికున్నది.

మా నాన్న "ఆధునికుడు". ఆయన ఈ మద్రాసులోనే చదువుకున్నాడు. ఆ రోజుల్లో వీరేశలింగం గారిని కూడా యెరుగును. ఆయనకు మూఢ విశ్వాసాలంటే కోపం. మమ్మల్ని– కనీసం మా ముగ్గురు పిల్లల్నీ – తన ధోరణిలో పెంచాడు. ఆయన బతికున్నంత కాలం మా అమ్మకూడా ఆయన పద్ధతులే అవలంబించింది. ఆవిణ్ణి చాలా సంస్కారం పొందిన మనిషల్లే చూసేవారు. ఆవిడ మహిళల సభలకు వెళుతూ వుండేది. కొన్ని మహిళా సమాజాలలో సభ్యురాలుగా వుండేది.

రాజకీయాల విషయంలో మా నాన్నను నాస్తికుడనవచ్చు. ఆయనకు ఏ రాజకీయోద్యమంలోనూ విశ్వాసం లేదు. ఒక్క సంఘసంస్కారం విషయంలో తప్ప మిగతా ఏ విషయం లోనూ ఆయనకు విశ్వాసం లేదు. కాంగ్రెసు ఉద్యమాలన్నిటినీ ఆయన ఖండించాడు. వాటివెంట ప్రజలు సంస్కారం పొందలేదనీ కొన్ని కేకలు వెయ్యటం మటుకే నేర్చుకున్నారనీ ఆయన నమ్మాడు. ఆయన దృష్టిలో సంస్కారహీనులుగా ఉండి కాంగ్రెసు ఉద్యమంతో పైకివచ్చిన ప్రతివ్యక్తినీ ఉదాహరణగా తీసుకుని, ఆయన కాంగ్రెసు ఉద్యమాలను ఖండించాడు. సంస్కారం గురించి ఆదర్శవాదం అవలంబించిన వారంతా ఇట్లాగే ప్రవర్తించారేమో అనుకుంటాను. మా అన్నలిద్దరూ కాంగ్రెసు భక్తులుగా తయారుకావటం ఆయనకు చెప్పరాని బాధ కలిగించింది. "ఫలాని కాంగ్రెసు దౌర్భాగ్యుడు తనకూతురికి

పదోఏట పెళ్ళిచేశాడు. పన్నెండోఏట అది ముండమోసింది. దానికి పెళ్లి చెయ్యడు. నా కడుపున పుట్టినవాళ్లు వాడి రాజకీయపక్షమా?" అని ఆయన ఆక్రోశించటం నేనెరుగుదును.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావటం ఆయన ఎరుగును. దానిక్కూడ ఆయన చలించలేదు. "ఈ కాంగ్రెసువాళ్లు వచ్చి ఆఖరుకు శారదా చట్టమైనా* గట్టిగా అమలు చేస్తారని నాకు నమ్మకం లేదు. దొంగలూ దొంగలూ చేరి ఊళ్ళు పంచుకుంటారు. చూస్తూ ఉండండి!" అనేవాడాయన.

ఆయనకు కమ్యూనిస్టులన్నా కోపమే. సంస్కారానికి వాళ్లు పరమశత్రువులనీ, దరిద్రులనూ, మూఢవిశ్వాసపరులనూ వాళ్లు వెనక వేసుకువస్తారనీ, అందరికంటే గట్టిగా అరవటం తప్ప వాళ్లకింకో ఆశయం లేదనీ ఆయన దృఢనమ్మకం.

ఇక హిందూ మహాసభంటే ఆయనకున్న ఆగ్రహం చెప్పనలవికాదు. వాళ్లు కమ్యూనిస్టులల్లే అసంస్కారులేగాక, కుసంస్కారులని కూడా ఆయన వాదం.

ఇదంతా చెప్పానంటే ఆయన పోయిన మరుక్షణంనుంచీ మా కుటుంబంలో కలిగిన సాంస్కృతిక పరిణామం చూస్తే ఆయన ఏమనుకునేవాడో అని నేనిప్పటికీ ఆశ్చర్యపడుతూ వుంటాను. ఆయన పోగానే ఆయన బీమాచేసిన మొత్తం పదమూడువేల చిల్లర మా అమ్మ పేర వచ్చింది. అప్పటికే మా అన్నలిద్దరూ ఏవో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నేనుమటుకు బియ్యే ప్యాసై ఎమ్మేలో ప్రవేశించాను. మా అక్కకు వివాహమైంది. ఆవిడ తాను కోరిన వరుణ్ణి పెళ్ళాడింది. మానాన్న కోరిన ప్రకారమే దమ్మిడీ కట్నం లేకుండా, దుర్వ్యయం ఏమీ లేకుండా ఆవిడ పెళ్ళి అయింది. ఆవిడభర్త బియ్యేబీటి పాసై మన ప్రాంతాల ఉపాధ్యాయుడుగా ఉంటూండేవాడు. వారికిద్దరు పిల్లలుకూడా కలిగారు. మా చెల్లెలుకు మాత్రం ఇంకా వివాహం కాలేదు. మానాన్న పోయేనాటికి దానికి పద్దెనిమిదేళ్ళు మాత్రమే. ఇంటరు రెండోఏడు చదువుతూ ఉండింది.

మానాన్న పోగానే మా అమ్మలో కలిగిన మార్పు వర్ణనాతీతం. ఆవిడ ఒక్కసారిగా పదమూడు, పద్నాలుగువేల రూపాయలకు అధికారిణి అయింది. ఆ డబ్బును ఆవిడ ఎట్లా ఖర్చు చెయ్యాలో మా నాన్న నిర్ణయించలేదు. మా నాన్న అనేక స్వల్పవిషయాలను గురించికూడా ఆవేశంగా మాట్లాడటం నేనెరుగుదునుగాని, ఆయన డబ్బును గురించి ఎన్నడూ ఆలోచించినట్టుగాని, దానికి ఏ విధమైన ప్రాధాన్యమూ ఇచ్చినట్టుగాని నాకు జ్ఞాపకం లేదు. తాను అభిమానించేవారిలో ఎవరికి డబ్బుతో అవసరం వచ్చినా, తనదగ్గర సిద్ధంగా డబ్బుంటే ముందూ వెనకా ఆలోచించకుండా ఆదుకునేవాడు.

మా అమ్మ మటుకు తన దగ్గర ఉన్నడబ్బును ఒక్క క్షణంకూడా మరిచిపోలేక పోయింది. భర్త పోయినందుకు ఎరిగినవాళ్లు పరామర్శించే స్థితి ఇంకా దాటకపూర్వమే

ఆవిడ ఆ పదమూడు వేలతోనూ, ఇల్లు కట్టించటమే కాదు, కారు – చవుకలో వచ్చేది, పాతదైనాసరే పోనీ – కొనటమే కాదు, మా అక్కపిల్లలకు తోపుడుబళ్లు కొనటమే కాదు – మా అక్కకూ చెల్లెలికీ బంగారు తొడుగులు చేయించటమే కాదు – లక్షలకు విలువైన ఆలోచనలు చేసి అన్నీ నిజమైనట్టే ఆనందించింది. ఆవిడ ఆ డబ్బును ఒక్కక్షణం మరచిందనుకోను. ఎవరెవరికి ఎంతెంత ఆస్తి అనుకోకుండా సంక్రమించినా ఆ కథలను పవిత్రంగా చెప్పుకునేది. మానాన్న ఎప్పుడెప్పుడు ఎంతెంత మొత్తాలు దానధర్మాలు చేసిందీ చెప్పి, అటువంటి పనులు చెయ్యకుండావుంటే మాకు అధమం యాభైవేలు రొక్కం ఉండి ఉండాలిసిందే ననేది. ఆ మధ్య రైలు ప్రమాదంలో చచ్చి పోయినవారి పిల్లలకు ప్రభుత్వం ఎంతో పరిహారం ఇచ్చినట్టు విని, “పోనీ, పాపం! సంపాదన పరుడు పోయినాక పిల్లలకు ఆ పాటి ఇవ్వకపోతే ఎట్లా?” అన్నది. ఆవిడ మాటలు వింటుంటే రైలు ప్రమాదంలో చచ్చిపోవటంకంటె పోయినవాడి పిల్లలకు డబ్బురావటం చాలా ముఖ్యమనిపించింది. ఎవరు ఏం లేదనుకున్నా సరే మా అమ్మ “కొందాం!” అనేది. “కొందాం” అనేమాట ఎవరు ఏ క్షణంలో అన్నా అనవచ్చు. కాని ఆ రోజుల్లో మా అమ్మ అన్నప్పుడు ఆ “కొందాం” అన్న మాటకు పదమూడువేల తులాల బరువుండేదంటే మీరు నమ్మవచ్చు!

నేను మా అమ్మనుగురించి ఎరగనివారి ఎదట ఇట్లా మాట్లాడుతుంటే, “వీడెంత అసహజమైన కొడుకు!” అని మీరు ఆశ్చర్యపడవచ్చు. అదే నే చెప్పబోతున్నదికూడా. నేను సహజమైన కొడుకునుకాను. నాకెందుకో ఆవిడ తల్లిలాగా కనిపించదు. నేను ఆవిడను ఎవరో అల్లే పరిశీలించాను. ఆవిడ ముఖంలో కలిగే ప్రతిమార్పునూ, ప్రతిమాటలో ప్రతినొక్కునూ బద్ధవైరిలాగా గమనించి మనసారా ద్వేషించాను. ఆ డబ్బు నాకు రాకుండా ఆవిడచేతికి వచ్చిందని నాకు లోపల అక్కసు అనుకునేరు. అదెంత మాత్రం కాదు. నేను కాస్త కపటంగా ప్రవర్తించి ఉంటే ఆ డబ్బులో కొంత వచ్చిఉండేది. ఆవిడ మీద నాకుగల అసహ్యాన్ని బయటపెట్టి నేనా డబ్బును దూరంగా కూడా ఉంచాను. ఆవిడ షరతు మీద ఆ డబ్బు ముట్టుకునేకంటె తిండికి మాడి చావటం మేలనిపించింది నాకు. ఆ డబ్బుకూ నా ఆత్మగౌరవానికీ మధ్య మా అమ్మ మనస్తత్వం సైంధవుడల్లే అడ్డుపడింది. నా కథ వినండి:

మా అమ్మలో మార్పు నాకే అసహ్యం కలిగిస్తే, మా చెల్లెలు నాకన్న కూడా మరింత అసహ్యపడింది. “అమ్మకి నిజంగా మతిపోయింది!” అని అదియెన్నోసార్లు నాతో అన్నది. నేనూ మా చెల్లెలూ ఒక వయస్సు వాళ్ళం కావటం చేతనేమో, చాలా విషయాలలో ఏకీభవించే వాళ్ళం. కాని ఏ విషయంలో కూడా మా అమ్మ విషయంలో కలిగినంత ఏకాభిప్రాయం కలగ లేదన్నమాట. మా అమ్మ తనకేది కొంటానని ఉబలాటపడినా సరే

మా చెల్లెలు తడువుకోకుండా, "నాకది అక్కర్లేదు, నా కదంటే అసహ్యం!" అనేసేది. ఒకసారి మా అమ్మ బజారు నుంచి ముచ్చటగా జరీచీరె తెస్తే మా చెల్లెలు "ప్రాణంపోయినా నేనీ చీరె కట్టుకోను. మా కాలేజీలో ఆడపిల్లలంతా గేలిచేస్తారు. మగపిల్లలంతా వెంటపడతారు!" అని ఖచ్చితంగా చెప్పేసింది.

కొద్దిరోజులపాటు మా అమ్మ నాలోనూ, మా చెల్లెలిలోనూ విరోధభావం వున్నట్టు గమనించలేదు. కనీసం గమనించనట్టు నటించింది. గమనించక విధిలేని పరిస్థితి యేర్పడ్డాక మేం తననుచూసి యేడుచుకుంటున్నామని ఆరోపించింది. "నిన్నుచూసి ఏడుచుకోవటానికి నీలో ఏముంది?" అని మా చెల్లెలు అడిగేసింది. దానికి మా అమ్మ నేరుగా సమాధానం చెప్పక, "మీనాన్న పోయినాక మీకు నన్ను చూస్తే గౌరవం పోయింది. బయటివాళ్ళే నయం. వాళ్ళు నన్ను వెనకటిలాగే చూస్తున్నారు" అన్నది. "వెనకటిలాగేం ఖర్మం? అంతకంటె బాగానే చూస్తున్నారు!" అన్నది మా చెల్లెలు.

మా చెల్లెలనే మాటలు సరిగా నా మనసులోనుంచి వస్తున్నట్టే వుండేవి. కాని నేనా మాటలు అనగలిగివుండను. మా అమ్మ మనస్తత్వానికి నేను చలించినంతగా మా చెల్లెలు చలించలేదని, అందుకే నేననలేనిమాటలు అది అనేసేదని నా అనుమానం.

ఏమైనా మా అమ్మకు కావలసిన సంతృప్తి మేమివ్వలేకపోయాం. అటువంటి సంతృప్తి ఇచ్చినవాడు మా బావ – మా అక్క మొగుడు. ఆ భార్యాభర్తలు మానాన్న పోయినప్పుడు వచ్చారు. నాలుగు రోజులుండి వెళ్ళారు. మళ్ళీ వాళ్ళు నాలుగుమాసాల అనంతరం వేసవి సెలవుల్లో పట్నం వచ్చారు. మా అమ్మ తనకు నామీదా మా చెల్లెలిమీదా ఉన్న కోపమంతా ప్రేమరూపంలో మా అక్కమీద కురిపించింది. మా అక్క కూడా మా అమ్మకు తగ్గట్టుగానే ప్రవర్తించింది. ఆవిడ మా అమ్మ చెప్పే కబుర్లన్నీ ఎంతో ఆత్రంగా విన్నది. ఆత్రంగా వినటమేకాదు ఆవిణ్ణి బాగా ఎగదోసిందికూడానూ. మా అక్కా బావా వచ్చినరోజే మా అమ్మ వాళ్ళిద్దర్నీ వేసుకుని బజారుకు బయలుదేరింది. దీనికెంత ఉపోద్ఘాతం! మా అమ్మచేసిన హడావుడేనా? "ఒరే, అబ్బాయ్ బాంకు నుంచి ఓ వందైనా డ్రా చెయ్యాలిరా! కాస్త ఈ పూట బాంకుకు పోయిరావూ? మానాయనగా! అన్నట్టు వెయ్యి విడిగా ఫిక్సెడ్ డిపాజిట్టు వేశాం చూడూ? దానికి గడువెప్పుడో –" ఆవిడ ఈ ధోరణిలో మాట్లాడుతుండగనే నేను అవతలికి వెళ్ళిపోయినాను. నామీద గొంతుదాకా కోపం వచ్చివుంటుందిగాని అంతకు మునుపే రైలు దిగిన అల్లుడు కూతుళ్ళ యెదుట తన నిత్యజీవితం అసంతృప్తికరంగా వుంటోందని బయటపడనిస్తే యెట్లా? అందుకని నన్నేమి అనకుండా మాట్లాడక ఊరుకుంది. ఆ రాత్రి దీపాలు పెట్టాక మా అమ్మా, మా అక్కా, బావా టాక్సీలో దిగారు. తోపుడుబండీ, ఆటవస్తువులూ మొదలైన వాటితో సహా!

కొన్ని రోజులపాటు మాఅక్కా అమ్మా అతుక్కుని ఊడిరాలేదంటే నమ్మండి. మా అమ్మ నాకోసమూ, మా చెల్లెలికోసమూ తలపెట్టిన ఖర్చును మేమిద్దరం యెంత ప్రతిఘటించామో, మా అక్క తనకోసం మా అమ్మ చెయ్యబూనిన ఖర్చును అంతగా ప్రోత్సహించింది. ఆవిడ ఒక చీరె కొంటానంటే మరోటికూడా కొనమనేది. మా అమ్మ మా బావకు ధోవతులు కొంటానంటే ఏకంగా సిల్కువి కొనమనేది. న్యాయం ఆలోచిస్తే, నేన్నూ, మా చెల్లెలూ మా అమ్మకు అసంతృప్తి కలిగించాం గనక, మా అక్క చాలా సంతృప్తి కలిగించి వుండాలి. కాని అట్లా కలిగించిందని నేననుకోను. మా అక్క మీది అసంతృప్తి ఎప్పుడు ఏ రూపంలో బయటపడుతుందో చూడాలని నేను పొంచివున్నానన్నమాట. మా అక్క వచ్చిన మూడోనాడు మా అమ్మ మా అక్కపిల్లలకు వీథిలో అమ్మే బెలూనులు అణాపెట్టికొంటూ, "ఎంతడబ్బూ హతమైపోతోంది. ఏం చిత్రమో!" అన్నది. నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. గొప్ప పరిశోధకుడికి కొత్త విషయం తెలిసినా అంత ఆనందం కలగదు.

ఇక మిగిలిన పరిణామాలేవీ నా దృష్టిలో ఆశ్చర్యకరమైనవి కావు. ఒక లక్షాధికారి మనస్తత్వం అణాదగ్గర ఎప్పుడైతే పిల్లి మొగ్గవేసిందో అప్పుడే నేను రాగలవి కొంతవరకు వూహించ గలిగాను.

మా బావ శలవులు అయిపోయాయి. కానీ మా అక్కకు పట్నం విడిచి పోబుద్ధి కాలేదు. వెధవది నూట డెబ్భైరెండు రూపాయిలన్నర జీతానికి పట్నం వొదిలేసుకుని దిక్కూ దివాణం లేనిచోట పడివుండటం వృథా. కాస్త నింపాదిగా విచారిస్తే తన భర్తకు పట్నంలోనే ఏదో ఉద్యోగం దొరక్కపోదని మా అక్కయ్య అభిప్రాయపడింది. మా బావను ఉద్యోగానికి రాజీనామా ఇప్పించటానికి ఒప్పించింది. ఆయనకు అనుకున్నంత సులభంగా ఉద్యోగం దొరకలేదు. కాని మునిగి పోయిందేం? ఖర్చు చేసేటందుకు డబ్బున్నది. కాలం హాయిగా వెళ్ళిపోతుంది.

తన దగ్గర డబ్బున్నందుకు మా అమ్మ సంతోషించినమాట నిజమే గాని, ఆవిడ పడ్డబాధ ఆవిడకన్న నేను బాగా గుర్తించాను. విరుద్ధభావాల మధ్య ఆవిడ నలగసాగింది. మా అక్కా ఆవిడా ఒకే కట్టగానే వున్నారు గాని లోలోపల యేదో రగులుతూ వున్నట్టు మధ్య మధ్య సన్నటి పొగలు వచ్చేవి. మా అక్క ఏదన్నా ఖర్చు చెబితే, మా అమ్మ దమ్మిడీల దగ్గర్నుంచీ పొతంగా వాడుతున్నదానల్లే, "అబ్బ అది లేకపోతే ఇప్పుడేమే? అన్నీ దండగమారి ఆలోచనలూ!" అనేది. ఆ మర్నాడే మా అక్క గూట్లోనుంచి అర్ధరూపాయి తీస్తే మా అమ్మ దానికోసం వెతుక్కుని, రాద్ధాంతంచేసి, "క్షణం కిందట పెట్టిన డబ్బులు మాయమవుతై" అనేది. "నేను తీశానమ్మా! ఎందుకంత ఆర్భాటం చేస్తావ్?" అని మా అక్క అంటే, "కాస్త చెప్పకూడదూ? నాకు వెతకటం తప్పునుగా" అనేది.

ఎంతసేపూ మా అమ్మకూ, డబ్బుకూ గల చుట్టరికం గురించే మాట్లాడుతున్నానని విసుక్కోకండి. ఇంకా ఇతర విషయాలు మా నాన్న చూస్తే నిర్ఘాంతపొయ్యేవి కొన్ని జరిగాయి. మా అక్కపిల్లలు వచ్చాక వాళ్లు తుమ్మినా, చీదినా మా అమ్మ వాళ్ళకు దిష్టి తీసేది. మా నాన్న హయాంలో ఈ దిష్టి ఎరగం. దిష్టితోపాటు దేవుళ్ళకు మొక్కోటాలు వారాలూ వర్జాలూ చూడటాలూ, శకునాలు పాటించటాలూ ప్రారంభమైనాయి. వీటికి మా బావ ఊతం యివ్వసాగాడు. ఆయనకు జ్యోతిషంలోనూ, హస్తసాముద్రికంలోనూ, అంకెల శాస్త్రంలోనూ కొంత ప్రవేశం వుంది. నేను చూస్తుండగానే తిరపతి యాత్రకూడా ఒకటి జరిగింది.

ఇవన్నీ ఉండగా మా చెల్లెలు పెళ్ళి సమస్య ఒకటి వచ్చింది. మా అక్క పెళ్ళిగురించి మా నాన్న ఎన్నడూ ఆదుర్దా పడలేదు. సంబంధాలు వెతికినా మా అక్కకు తెలీకుండా ఎన్నడూ వెతకలేదు. మా చెల్లెలితో చెప్పకుండా కూడా మా అమ్మ సంబంధాలు స్థిరపరచటానికి ప్రయత్నించింది. "మనకులం, మనశాఖ" చాలా ప్రాముఖ్యం వహించాయి. నా సహోధ్యాయి అన్న ఒకడు మా చెల్లెల్ని చేసుకోవటానికి ఇష్టపడినట్టు తెలియజేశాడు. కాని "మావాడు" కాదని మా అమ్మ కొట్టిపారేసింది.

"కావలిస్తే అమ్మాయికి నేను కట్నం ఇస్తాగా! మంచి సంబంధమే చేద్దాం!" అనేది.

మా అమ్మకు ఇష్టమైందని తెలిశాక మా చెల్లెలు ఏ సంబంధమైనా కొట్టిపారేసే స్థితికి వచ్చింది. దీనివల్ల కొన్ని మంచి సంబంధాలు పోయాయేమో కూడానూ! కాని అది లక్ష్యపెట్టలేదు.

మా అమ్మకు అక్కకూ మధ్య పొగలు రావటమల్లా మంటలు రేగటం దాకా వచ్చింది. ఎవరూ తక్కువతిన్న వాళ్ళు కారు.

"తే..తే.. అంటావు, ఎక్కణ్ణించి తెచ్చేదే? నీకన్న చిన్నవాళ్ళున్నారు. వాళ్ళిద్దరూ నాడబ్బు కానీ, ముట్టరు. ఎంత పెట్టినా మెప్పులేదు. తే,తే అనటం తప్ప నీ కింకేమీ తెలీదు!" అని మా అమ్మ.

"నిన్నసలెవరు పెట్టమన్నారూ? నీమాటలకు మోసపోయికాదూ మేం నిక్షేపమంటి ఉద్యోగం మానుకుని ఈ దిక్కుమాలినచోట పడింది? నీ మిగిలిన పిల్లలకు పెట్టొద్దని నేనన్నానా?" అని మా అక్క!

మా అక్క ఆగ్రహం మామీదికికూడా తిరగసాగింది. తన సొత్తేమో మేం అపహరిస్తున్నట్టు!

నేను ఎమ్మేపరీక్షకు కూచున్న ఏడు మా అన్నలిద్దరూ శలవులకు వచ్చారు,

కుటుంబాలతోసహా. మా అమ్మ తన ధనికత్వమూ, ఆప్యాయతా వాళ్ళమీద చూపింది. కొద్దిరోజుల పాటైనా వాళ్లు మా అక్కలాగా ప్రవర్తిస్తారనుకున్నది మా అమ్మ. కాని ఆ ఆశ పారలేదు. వాళ్లు ఆవిడ డబ్బు ఖర్చుచెయ్యటానికి ఒప్పుకున్నారుగాని దానికి ప్రతిఫలంగా ఆవిణ్ణి ఉబ్బెయ్యటానికి మటుకు సిద్ధపడలేదు. మా బావకూ వాళ్ళకూ అసలు పడలేదు. అతను సంవత్సరంనుంచీ ఇక్కడే తిష్టవేసి ఉండటం వాళ్ళకేమీ రుచించలేదు. మొగుణ్ణి వెనకేసుకొచ్చి మా అక్క వాళ్ళతో చచ్చేటట్టు పోట్లాడింది. తనకొడుకుల్ని వెనకేసుకొచ్చి మా అమ్మ మా అక్కతో పోట్లాడింది. వాళ్లున్నన్నాళ్ళూ కొంప ఎట్లా ఉండాలో అట్లావుంది. చాలా రోజులకు అప్తులు కలుసుకున్న వాతావరణం ఏ కోశానా నాకు అనిపించలేదు. అన్నలు తమ్ములకేమవుతారో, చెల్లెళ్లు అక్కల కేమవుతారో మా కుటుంబాన్ని చూసినవాళ్ళకి అర్థమై ఉండేది కాదు.

దురదృష్టవశాత్తూ ఈ శలవులై పోయేలోగానే మా రెండో అన్నకు పట్నం బదిలీ అయింది. ఆయన మళ్ళీ వెళ్ళిపోలేదు. మా ఇంటి వాతావరణం చెప్పటానికి వీల్లేదు. రోజూ కొట్లాటలే, ఈ కొట్లాటలకు కారణాలుండేవేగాని ఆ కారణాలకు అర్థం ఉండేదికాదు.

నేను సమ్మెలు చూశాను. పోలీసుల లాఠీచార్జీలు చూశాను. ఎన్నో ఘోరాలు చూశాను. కాని మా ఇంట్లో జరిగే పోట్లాటలంత అర్థరహితమైన సంఘటనలు ఎక్కడా చూడలేదు. ఇంత తినడానికుండి బతకటం చేతకాని మధ్యతరగతి కుటుంబంలో పుట్టినవాడు తప్ప ఈ కొట్లాటలను ఊహించుకోలేడు. ఇంట్లో డజనుమంది ఉంటే ఏ ఇద్దరిమధ్యనైనా శత్రుత్వం ఉండేది. అది అచ్చుగా స్వార్థంతో కూడుకున్నది కూడాకాదు.

ఒక ఉదాహరణ చెబుతాను: మాచిన్నన్న వచ్చాక ఆయన మా బావగారికొక ఉద్యోగం ఇప్పించటానికి ప్రయత్నించాడు. జీతం తక్కువ, నూటపాతికే. మా అక్క మా చిన్నన్న మీద మండిపడింది. "నువు మూడొందల రూపాయల ఉద్యోగం చెయ్యాలా? మా ఆయనకు నూటపాతికా! చేతకానివాడివి ఊరుకోరాదూ? తగుదునమ్మా అని రాకపోతే ఏం? నిన్ను ఉద్యోగం ఇప్పించమని కాళ్ళావేళ్ళా పడ్డామా?" అని గయ్ గయ్‌లాడింది. మా చిన్నన్న నాలుగూ పెట్టాడు. ఇంతకూ మా బావ ఆ ఉద్యోగం ఒప్పుకున్నాడు. ఒప్పుకుంటే ఏమయిందీ? రోజూ వచ్చి మా చిన్నన్నను దెప్పేవాడు. పని జాస్తిట! తనను తగినంత గౌరవంగా చూడరుట ఆఫీసులో! శనివారంకూడా పనిచెయ్యాలిట! ఉద్యోగం మాష్టరు పనల్లే లేదుట.

ఎవరు ఏ క్షణాన ఎవరిపక్షమో ఎవరికీ తెలీదు. ఒకరోజున, ముహూర్త బలాన్ని బట్టి మా అమ్మ మా చిన్నన్నను వెనకేసుకొచ్చి మా అక్కతో ఏదో అన్నది. మా అక్కకు

కోపం రెచ్చిపోయి మొగుడితో "ఈ వెధవ కొంపలో నేనొక్కక్షణం ఉండను. ముందు వెళ్ళి ఇల్లు చూస్తారా చూడరా?" అన్నది. అసలు మా అక్క వారానికోసారి వేరే ఇంటికి వెళ్ళినంత పనీ చేసేది. ఇల్లు లేకనో, సామాను పట్టుకెళ్ళటానికి సమయానికి డబ్బులేకనో మానేసేది.

ఇట్లా వుండగా మా చెల్లెలు ఇంటరు పూర్తిచేసి ఇంటిదగ్గరే వుంటున్నది. తన పెళ్ళి ప్రయత్నాలు తానే చూసుకోసాగింది. ఈ సంగతి కొన్నాళ్లు మా వాళ్లకి తెలీదు. అందరికన్న ముందు తెలిసింది నాకే. అప్పటికే ఉభయపక్షాలూ పెళ్లి స్థిరం చేసుకున్నారు. నేనెవరితోనూ చెప్పలేదు. కాని మా చెల్లెల్ని చేసుకోబొయ్యేవాణ్ణి గురించి మటుకు కొంత ఆరాతీసి కొంత వరకు తృప్తిపడ్డాను.

మా చెల్లెలి రహస్యం మా అక్క కనిపెట్టింది. మా చెల్లెలి డ్రాయరు వెతికి అందులోంచి ఒక చిన్న ఉత్తరం తీసింది. మా చెల్లెలి రంకు కనిపెట్టినట్టుగా మాట్లాడింది మా అక్క. మా చెల్లెలు పోట్లాడింది.

"నీ విషయాలు నువు చూసుకో. నా జోలికిరాకు!" అని అది సలహాచెప్పింది.

మా అమ్మ పంచాయతీ చేసింది. ఆ వుత్తరం రాసిన వాడి పేరు చెప్పమని మా చెల్లెల్ని నిలవేసింది. నేనూ, మా చిన్నన్నా మా చెల్లెలి పక్షం అయినాం. మా బావ భార్యపక్షం అయినాడు. ఆ చర్చ వర్ణనాతీతం. ఎవరో సంబంధంలేని వాళ్ళ రంకు గురించి కూడా అంత ఆసక్తి కనబరచం. మా చెల్లెలు మటుకు పరీక్షకు నిలబడింది. దాని నోట ఒక్కమాట రాలేదు.

తరవాత కొద్దిరోజులకే దాని పెళ్ళి అయింది. మా అమ్మ రాజీకివచ్చి పెళ్ళికి కనీసం వెయ్యిరూపాయలైనా ఖర్చు పెట్టటానికి యత్నం చేసింది. అనేక వస్తువులు కొన్నదికూడా. మా చెల్లెలు వాటిలో ఒక్కటి ముట్టుకోలేదు.

ఈ పెళ్ళికి ముందే నేను ఉద్యోగం సంపాదించుకుని పట్నం వదిలేశాను. ఇల్లు వొదిలేసినాకనే నాకు మనుష్యులమీద అభిమానమంటూ పుట్టింది. ఇంకొకరిని అర్థంచేసుకోవటమూ, ఇంకొకరి కష్టసుఖాలు పంచుకోవటమూ మొదలైనవి నాకు బయటి ప్రజలు నేర్పారుగాని, ఇంట్లో వాళ్ళుకారు. ఈ యింట్లోవాళ్ల మీదనైనా దూరం వెళ్ళాకనే యేదో అభిమానం పుట్టింది. మొన్ననే మళ్ళీ వచ్చాను.

నేను మా ఇంట్లో అడుగుపెడుతుండగానే మా వాళ్లంతా ఎగబడి పెద్ద శుభవార్త చెప్పినట్లు ఎంతో ఆనందంతో ఒకరికొకరు అడ్డంవస్తూ చెప్పారు. తీరా వింటే మరేమీలేదు. మా బావ గారికి ఉద్యోగం ఊడిందిట! అందులో మా అమ్మ పట్టలేనంత ఆనందం పొందడానికేముందో, మా వదినె అందరికీ అడ్డంవచ్చి అందరికన్నా గొంతుచించుకొని

పరవశమై పోవటానికేముందో నాకర్థం కాలేదు. ఇది ఒకటేకాదు, మాబావ ఒక్కడికే కాదు, ఆ కొంపలో యెవరికి యెదురు దెబ్బ తగిలినా మిగిలినవారంతా ఏకగ్రీవంగా నవ్వటానికి సిద్ధంగా వున్నారు. ఇది మా ఇంటి కథ. దీనికి అర్థం ఏమన్నా వుంటే మీరు చెప్పండి. తెలుసుకోవటానికి నేను సిద్ధంగా వున్నాను.

*మొదటి ముద్రణ : ఆంధ్రజ్యోతి మాసపత్రిక, జనవరి 1953*

* శారదా చట్టం : శారదాబిల్లు – ఈ చట్టం ప్రస్తావన 1915–40 మధ్య జీవితం ఇతివృత్తంగా ఉండే కథల్లో, నవలల్లో కుటుంబరావుగారు తరచు తెస్తారు. రజస్వల అయ్యేనాటికి ఆడపిల్లకు పెళ్లి చెయ్యని తండ్రి, ఆ పిల్ల పెళ్లి చేసేటంత వరకు ఆ అమ్మాయి బహిష్టు రక్తాన్నీ తాగాలి అనే అమానుష సంప్రదాయాన్ని సంస్కరించేందుకు ఉద్దేశించిన చట్టమే శారదా చట్టం. 1930 ఏప్రిల్‌లో ఈ చట్టం అమలులోకి వచ్చింది. శారదాచట్టం కర్త హీర్‌జిలాస్ శారద. ఈ చట్టం ప్రకారం పద్దెనిమిది ఏండ్ల లోపు మగపిల్లలు, పదిహేను ఏండ్ల లోపు ఆడపిల్లలు పెళ్లిచేసుకోకూడదు. బాల్య వివాహాలకు శిక్ష మూడు నెలలు జైలు లేదా వెయ్యి రూపాయల జరిమానా. సనాతన హిందువులు సహజంగానే ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. కుయుక్తులతో ఈ చట్టానికి తూట్లు పొడిచారు. 1938లో 7వ చట్టం వచ్చేదాకా ఫ్రెంచ్‌వాళ్ల ఏలుబడికింద ఉన్న ప్రాంతాల్లోనూ నైజాం వంటి రాష్ట్రాల్లోనూ బాల్య వివాహాలను చేశారు.